క్లుప్తంగా

తోటగరువు హైస్కూల్‌ను సందర్శించిన ఆర్జేడీ



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఆర్జేడీ భాస్కర్

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యా జోన్–1 ఆర్జేడీ బి.విజయభాస్కర్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య గురించి ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ 6 నుంచి 9వ తరగతి వరకు జరుగుతున్న వార్షిక పరీక్షలు(ఎస్‌ఏ2) రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పరీక్షలు జరిగిన తర్వాత పేపర్లు మూల్యాంకనం చేయడం, ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయడం, ప్రమోషన్ జాబితాలు తయారు చేయడం, తదితర వాటిలో జాగ్రతలు పాటించాలని, అన్ని అంశాలతో వచ్చే విద్యా సంవత్సరానికి సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

మిల్లెట్స్‌తో ఉగాది చిత్రం



మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన ఉగాది చిత్రం

ఏయూ క్యాంపస్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలు(మిల్లెట్స్)తో ఉగాది చిత్రాన్ని తీర్చిదిద్దారు. చిరుధాన్యాలను ఉపయోగించి కోకిల, మామిడి తోరణాలు, మామిడి కాయలు, ఉగాది పచ్చడి వంటివి ఎంతో సహజ సిద్ధంగా తీర్చిదిద్ది తన సృజనాత్మకను చాటుకున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే చిరుధాన్యాలు వినియోగం పెరగాలన్న సందేశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు ఆయన తెలిపారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



కాలభైవర స్వామి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని శ్రీజ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన కాలభైరవ స్వామికి సోమవారం కొత్త అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తుల పేరిట గోత్ర నామాలతో పూజలు చేశారు.

39 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఎంవీపీ కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలాం, నందా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సెక్టార్–7లో సోమవారం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్ విద్యార్థులు 39 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ వితరణ

ఎంవీపీ కాలనీ: హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేర్ ప్రతినిధులు ఫర్నీచర్‌ను అందజేశారు. సోమవారం లాసన్స్ బే కాలనీలోని పాఠశాల ఆవరణలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బీరువా, కుర్చీలు, ఫ్యాన్లతో పాటు బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు, పప్పు దినుసులు, తదితర నిత్యావసరాలను స్కూల్ వ్యవస్థాపకుడు కండిపిల్లి శ్రీనివాసరావుకు అందజేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేర్ సభ్యులు రత్నం, అనూష, శోభారాణి, రాజేశ్వరి, శ్రీదేవి, చార్టెడ్ అకౌంటెంట్ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..

- 'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ విస్తృత ప్రచారం
- శివాజీ పార్కు వాకర్స్‌తో మాటామంతి
- వార్డుల్లో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం



20వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు హారతి ఇస్తున్న మహిళ



శివాజీపార్కు ఎదుట వాకర్స్‌తో ఎంవీవీ



ఇసుకతోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలతో మమేమకవుతూ గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనను ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఓటర్లను కోరుతున్నారు. సోమవారం ప్రచారంలో భాగంగా ఉదయం 17వ వార్డులోని శివాజీపార్కులో వాకర్స్‌తో మమేకమయ్యారు. వాకర్స్‌ను, సీనియర్ సిటిజన్స్‌ను పలకరిస్తూ, యోగ క్షేమాలు తెలుసుకోవడంతో పాటు జగనన్న పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు మువ్వల సురేష్, ప్రేమ్, రవికిరణ్‌రెడ్డి, కుమార్ రెడ్డి, మజ్జి వెంకటరమణ, పోలారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రచారం ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం 20వ వార్డు పరిధిలోని ఈస్ట్ పాయింట్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ జంక్షన్ నుంచి పాదయాత్రను ప్రారంభించి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు చేరువవుతున్న విధానం, ప్రజా సంక్షేమ పాలనలో జరుగుతున్న మేలు వివరించారు. ఎంవీవీ ప్రచారానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. హారతులిస్తూ ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్, పార్టీ నాయకులు వై.కుమార్‌రెడ్డి, మజ్జి వెంకటరమణ, రవికిరణ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, నైదాన పోలారావు, సుబ్బారావు, ఐడి శ్రీను, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇసుకతోటలో

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ మేరకు సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు.

23వ వార్డులో..

జీవీఎంసీ 23వ వార్డులో వైఎస్సార్‌సీపీ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు పిలక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



మద్దిలపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు పిలక మధుసూదన్‌రెడ్డి



17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ లావణ్య తదితరులు

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య ఓటర్లను కోరారు. 17వ వార్డు మద్దివారి వీధిలో స్థానిక 158 బూత్ కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఏలు ఎస్.వీరకుమార్, మరడ నాగమణి, మరడ కాత్రాజు, మరడ కామేష్, మరడ ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్తీక్ రవితేజ, ఎంపాడు కనకరెడ్డి, పులి అప్పయమ్మ పాల్గొన్నారు.

బొత్స దృష్టికి జర్నలిస్టుల సమస్యలు



మంత్రి బొత్సకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు మంత్రి బొత్స సత్యానారాయణను కోరారు. ఈ మేరకు లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే కేటాయింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా జర్నలిస్టులకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కోవిడ్‌లో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందజేయాలని, జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిని మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తనరావు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల సాంగ్ విడుదల



సాంగ్‌ను విడుదల చేస్తున్న కోలా గురువులు, తదితరులు

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో భాగంగా రూపొందించిన సాంగ్‌ను సోమవారం ఆవిష్కరించారు. లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్సా ఝాన్సీ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ×ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎంత మంది నాయకులు కలిసొచ్చినా.. ఎదురులేని నాయకుడు మా జగన్‌¤ అంటూ ఈ సాంగ్ సాగుతుంది. సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కంపోజ్ చేసిన ఈ సాంగ్‌ను వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు రవిరెడ్డి ఆవిష్కరించారు.

మార్కెట్లకు ఉగాది శోభ



ఎంవీపీ రైతుబజార్‌లో విక్రయిస్తున్న మామిడి, వేపు పువ్వు



పువ్వుల స్టాల్ వద్ద వినియోగదారుల సందడి

ఆరిలోవ: మార్కెట్లు, రైతుబజార్లకు ఉగాది శోభ సంతరించుకుంది. తెలుగు కొత్త సంవత్సరం సందర్భంగా ఉగాది పచ్చడి కోసం పూజ సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీగా మారాయి. ఎంవీపీ రైతుబాజర్, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, అంబేడ్కర్ కూడలి, చినగదిలి, పెదగదిలి, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ బజార్లలో మామిడి కాయలు, వేప పువ్వు, మామిడి కొమ్మలు, వివిధ రకాల పువ్వుల విక్రయాలు జోరుగా సాగాయి. మామిడి కాయలు సైజును బట్టి రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయించారు. పువ్వుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి.

అంకిత భావంతో ఎన్నికల విధులు

- అధికారులకు జేసీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల వేళ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని విశాఖ తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో నామినేషన్లు, పోస్టల్ బ్యాలెట్, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్, నామినేషన్ల ప్రక్రియపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ బడుల్లో సోషల్‌స్టడీస్‌కు ప్రాధాన్యం



ఎంపిక పత్రాన్ని అందిస్తున్న పైడిరాజు, మహేశ్వరరావు

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్‌ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టీ. రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్‌వీ.నారాయణను ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోషల్ స్టడీస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా భవిష్యత్‌లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

వైభవంగా నూకాలమ్మ పండగ



రూరల్ రెవెన్యూ కార్యాలయం వద్ద ఆలయంలో నూకాలమ్మ



పాత ఆరిలోవలో నూకాలమ్మకు పూజలు చేస్తున్న మేయర్ గొలగాని దంపతులు



సింహాద్రిపురంలో నూకాలమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ శ్రీవిద్య

ఆరిలోవ: నూకాలమ్మ పండగ సోమవారం ఆరిలోవ ప్రాంతంలో ఘనంగా జరిగింది. బాలాజీనగర్ దరి పాత ఆరిలోవ, రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాత ఆరిలోవలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బాలాజీనగర్, పాత ఆరిలోవ, బీసీ కాలనీ, తోటగరువు, గాంధీనగర్, డ్రైవర్స్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, సూర్యతేజానగర్, పార్వతీనగర్, టీబీసీ పాయింట్, లీలాసుందరినగర్, నెహ్రూనగర్, దుర్గాబజార్ ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూకాలమ్మను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం లీలాసుందరినగర్ వాసులు వందలాదిలా డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదురుగా నూకాలమ్మ అమ్మవారిని ఇందిరానగర్, రెవెన్యూకాలనీ, డెయిరీఫారం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. అమ్మవారిని రూరల్ తహసీల్దారు శివన్నారాయణ, పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు.

జీవీఎంసీ 15వ వార్డులో..

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో నూకాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. ప్రధానార్చకుడు డి.వెంకటరత్నం శర్మ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు, గాజులు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మ వారి సతకం పట్టు నుంచి ఉత్సవ విగ్రహాన్ని ఊరే గించారు. నేల డ్యాన్స్‌లు. పులివేషాలు, థింసా, బిందెల నృత్యం, తప్పెటగుళ్లు, కోలాటం నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భారీగా బాణాసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

'నా ఆరోగ్యం - నా హక్కు'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, చిత్రంలో ఎయిడ్స్, టీబీ అధికారి పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి ఉమావతి, తదితరులు

మహారాణిపేట: 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే అంశంపై లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శేషమ్మ మాట్లాడారు. పోక్సో చట్టం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కలెక్షన్, డిస్పోజల్ గురించి వివరిస్తూ లీగల్ అవేర్‌నెస్ ఏ విధంగా పాటించాలనే దానిపై వైద్యులు వృత్తి నియమాలు పాటిస్తూ చట్టబద్ధంగా ప్రవర్తించాలన్నారు. తద్వారా సమస్యలు ఉత్పన్నం కావని చెప్పారు. ఆరోగ్య విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చాలా వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి మాట్లాడుతూ మంచినీరు తాగడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, పలువురు వైద్యులు డాక్టర్ బద్రీ, డాక్టర్ జగదీశ్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, పలు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



గాంధీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: యువత మత్తు పదార్థాలు వాడకానికి దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. తోటగరువు, రవీంద్రగనర్ ప్రాంతాలలో స్థానిక యవకులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటగరువు వద్ద పశు సంవర్థక శాఖకు చెందిన ఖాళీ స్థలం, విమ్స్‌కు సంబంధించిన ఖాళీ స్థలం, రవీంద్రగనర్, వివేకానందనగర్ శ్మశానవాటిక తదితర ప్రాంతాలలో యువకులు మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్టు తెలిసిందన్నారు. మద్యం, గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం పూర్తిగా పాడై కుటుంబ సభ్యులకు, సమాజానికి దూరమవుతారన్నారు. ఎన్నికల వేళ కావడంతో యువకులు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కేసులు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు, కొట్లాటల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ఎక్కడైనా ఆకతాయిలు, రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలకు దిగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

సీఎం జగన్‌తోనే భావితరాల భవిష్యత్తు

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- మేము సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ



మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ



మేము సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

బీచ్ రోడ్డు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలనలో భావితరాల భవిష్యత్తు కోసం విద్య, వైద్య రంగాల్లో అనేక పెనుమార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం జీవీఎంసీ 21వ వార్డులో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబు గానీ, వెలగపూడి గానీ అలోచించారా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గరుండి చూశారని, విన్నారని వాటిని పరిష్కరించేందుకు నవరత్న పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. జగనన్న పాలనలో ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చారన్నారు. ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటూ అవ్వాతాతలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల అరాచకం కనిపించేదన్నారు. వారు చెప్పిన వారికే పెన్షన్లు ఇచ్చేవారని ఆరోపించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పదవీ కాలంలో ఏ రోజు కూడా పేదవాడిని పట్టించుకోలేదన్నారు. అటువంటిది ఐదేళ్లలోనే సీఎం జగన్ ఎన్నో అద్భుతాలు చేసి చూపించారని కొనియాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశారన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికీ 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికయ్యేందుకు తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని ఎంవీవీ పిలుపునిచ్చారు. 21వ వార్డులో సుమారు రూ.30 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవికుమార్, అల్లంపల్లి రాజబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను భాగం చేయండి



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన అసోసియేషన్ సభ్యులు

ఏయూ క్యాంపస్: హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గ సభ్యులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు ఎస్.మోహనరావు, కార్యదర్శి డి.వెంకట అప్పలనాయుడు, రాష్ట్ర చైర్మన్ ఆర్.హరి విఠల్.. వీసీని కలిసిన వారిలో ఉన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ గుర్తింపు పొందిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, యోగా. మెడిటేషన్ వంటివి నేర్పుతూ యువతను ఉత్తమ పౌరులుగా తయారు చేస్తుందని వారు అభిప్రాయపడ్డారు. దీనిలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలో స్కౌట్స్, గైడ్స్ భాగం చేయాలని కోరారు. దీనికి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సానుకూలంగా స్పందించారు.